2

# మొద్దబ్బాయిలూ మహా మేధావులే.....

– తిరుమల రామచంద్ర

## చదవండి – ఆలోచించండి – చెప్పండి

నాలుగయిదు సంవత్సరాల క్రితం తోటి అనుచరుల పట్టుదలవల్ల నేను ఆత్మకథ రాయడానికి అంగీకరించాను. రాయడం ఆరంభించి ఒక పేజీ పూర్తిచేశానో లేదో ఇంతలో బొంబాయిలో రగడ ప్రారంభమైంది. దాంతో నా ఆత్మకథ ఆగిపోయింది. నేను ఆత్మకథను త్వరగా రాసి గ్రంథరూపంలో ప్రచురించాలని స్వామీ ఆనంద్ కోరిక. నేను ఆత్మచరిత్ర వ్రాయాలని అనుకోలేదు. నేను అనేక సమయాల్లో సత్యప్రయోగాలు చేశాను. నాజీవితం అలాటి ప్రయోగాలతో నిండి ఉంది. ఈ ప్రయోగాలవల్లనే నాకు 'మహాత్మ' అనే బిరుదువచ్చింది. నాదృష్టిలో ఆ బిరుదుకుగల విలువ స్వల్పమే. సత్యపు ప్రమాణాలను వివరించడమే నాలక్ష్యం.

– మహాత్ముడు

### ప్రశ్నలు

1. పై పేరాను ఎవరు రాసి ఉంటారు?
2. 'ఆత్మకథ' అంటే ఏమిటి?
3. దీన్ని ఎందుకు రాస్తారు?
4. ఎవరెవరు ఆత్మకథలు రాశారో మీకు తెలుసా? కొందరి పేర్లు రాయండి.
5. గొప్పవాళ్ళ ఆత్మకథలను మనం ఎందుకు చదవాలి?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

డా॥ తిరుమల రామచంద్ర తన జీవిత విశేషాలను "హంపీ నుండి హరప్పాదాక" అనే గ్రంథంలో వివరించాడు. ఇది ఆయన ఆత్మకథ. తన బాల్యంనుంచి జీవితంలో చెప్పుకోదగ్గ విశేషాలను, జీవితానుభవాలను గ్రంథస్థంచేశాడు. తన బాల్యంలోని మిత్రులను గురించి, వారు ఎలా ఉన్నతస్థాయికి చేరుకొన్నారో ఆయా అనుభవాలను వివరించే భాగమే ప్రస్తుత పాఠ్యాంశం. మొద్దబ్బాయిలుగా పేరుపడ్డ తన తోటివాళ్లు మహామేధావులుగా ఎదిగిన విధాన్ని తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

*ఎవరైనా తమ జీవితానుభవాలను, విశేషాలను గ్రంథస్థంచేస్తే దాన్ని 'ఆత్మకథ' అంటారు. దీన్నే స్వీయచరిత్ర అని పిలుస్తారు. ఆత్మకథల ద్వారా వారి వ్యక్తిత్వాలేకాక సమకాలిక సంఘటనలు కూడా తెలుస్తాయి.*

*ప్రస్తుత పాఠం తిరుమల రామచంద్ర రచించిన 'హంపీనుండి హరప్పా దాక' అనే గ్రంథంలోది.*

## విద్యార్థులకు సూచనలు

- *పాఠం చిత్రం ఆధారంగా పాఠంలోని విషయాన్ని ఊహించండి.*
- *పాఠం చదవండి. అర్థంకాని పదాలను గుర్తించండి.*
- *వాటి అర్థాలను 'పదవిజ్ఞానం' పట్టికలోగాని నిఘంటువులోగాని చూసి రాయండి.*

## రచయిత పరిచయం



(1913-1997)

శ్రీ తిరుమల రామచంద్ర అనంతపురం జిల్లాలోని రాఘవంపల్లెలో జన్మించాడు. శ్రీమతి జానకమ్మ, శ్రీ శేషాచార్యులు ఈయన తల్లిదండ్రులు. ప్రాథమిక విద్య కాకినాడలోను, నెల్లూరు, తిరుపతి, మద్రాసులలో ఉన్నత విద్య సాగింది. రచయితగా, విమర్శకుడుగా, భాషావేత్తగా, పరిశోధకుడుగా, పత్రికారచయితగా పేరొందిన ఈయన జాతీయోద్యమంలో పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించాడు.

'హంపీనుండి హరప్పా దాకా' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 'గాథాసప్తశతిలో తెలుగు పదాలు' అనే గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించాయి.

ఈయన 'మహామహోపాధ్యాయ', 'పత్రకారశిరోమణి' వంటి బిరుదులు పొందాడు. తెలుగు విశ్వవిద్యాలయం, డా॥ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంనుంచి 'డాక్టరేట్'ను పొందాడు.

'మన లిపి పుట్టు పూర్వోత్తరాలు', 'హిందువుల పండుగలు - పర్వాలు', 'హాలుని గాథలు', 'బృహదారణ్యకం', 'మనవి మాటలు', 'బుద్ధుణ్ణి బళ్ళోవేశారు', 'నుడి-నానుడి' వంటి ఎన్నో రచనలు చేశాడు. ఈయన రాసిన వేయికిపైగా సమీక్షలు వివిధ పత్రికలలో ముద్రితమయాయి. విశేష సాహిత్య కృషి చేశాడు.

## I

**దేశకాలాలు మారినా, ఆపదలు విరుచుకొని మీద పడినా, గోడమీద గీచిన బొమ్మలాగ పెడమొగం పెట్టనివాణ్ణి స్నేహితుణ్ణిగా చేసుకోవాలి – అంటాడొక ప్రాకృతకవి.**

అదనులో విత్తిన విత్తనంలాగ మంచి సమయంలో ఆడిన మంచిమాట ఎంత మంచిని పెంచుతుందో ఇతరుల అనుభవంతోనేకాక, నా అనుభవంతోను గ్రహించాను.

మా కళాశాలలో ముగ్గురు మహామూఢులు ఉండేవారు. వాళ్లు ఒక్కొక్క తరగతిలో రెండు మూడు సంవత్సరాలు ఉంటూ దేకుతూ వెళ్లేవాళ్లు. వారికి మట్టిబసవడు, రాతి బసవడు, చెక్క బసవడు అని పేరు పెట్టారు తద్‌జ్ఞులు. మట్టిబసవడు ఎన్నో దండయాత్రలు చేసి చివరకు వ్యాకరణశిరోమణి పట్టాపుచ్చుకొని దేశంమీద పడ్డాడు ఉద్యోగం కోసం. రాతి బసవడు నా సహాధ్యాయుడయ్యాడు.

పాపం అతని తప్పేమీలేదు. రాత్రంతా చదివేవాడు. తెల్లవారి స్నానంతోపాటు చదువంతా నీరుగారిపోయేది. ఆరోగ్యంతో అందంగా ఉండేవాడు. పరీక్షలలో మార్కులు ఒక్క అంకెను దాటేవి కావు. ఎందుకితడు ఇంత మొద్దు – అని అనుకునే వాడిని. ఇతరులు హాస్యం చేసినా నేను ఏమీ అనేవాడిని కాదు. అతణ్ణి సానుభూతితో చూసేవాడిని. అతని లోపం ఏమీలేదు. దుర్విధి, దుర్విలాసం.

ఆరు నెలల పరీక్షలు జరిగాయి. అతని మార్కులు దేనిలోను 10, 12ను దాటలేదు. చాల చింతాక్రాంతుడై నా వద్దకు వచ్చాడు. నా స్వభావంలో ఒక మంచి ఉంది. ఎవరేమి చెప్పినా శ్రద్ధగా వింటాను. సాధ్యమయితే ఒక మంచి మాట, కాకపోతే మౌనం. ఇది మా నాన్నగారి గుణం, వారసత్వం. నాతో తన బాధ చెప్పుకొని ఏడ్చాడు. నా మనస్సు కరిగింది. చెప్పాను. “చూడు రామన్నా! (పేరు రామాచార్లు) సంస్కృతం చదివావు. సంస్కృతం ముక్కలు నోట కరచిన మాత్రాన మేధావివా? నీకు ఇది రాలేదు. మరొకటి ప్రయత్నం చేయి. నేను నా అమ్మ, తాతల బలవంతాన చదువుతున్నాను. గాని... నీవు ప్రైవేటుగా మూడవ ఫారం ప్యాసుకా, టీచర్స్ ట్రైనింగ్‌చేయి, బడిపంతులు ఉద్యోగం దొరుకుతుంది. హాయిగా జీవితం గడుపు. బతుకు ముఖ్యం, సంస్కృతం కాదు. తర్వాత ఇష్టం ఉంటే చదువుకో” అని సలహా ఇచ్చాను.


నా మాట అతనికి సూటిగా తాకింది. మరుసటి దినం నా వద్దకు వచ్చాడు. “రాముడూ, ఒక రహస్యం. నేను వెళ్ళిపోతున్నాను. ఎవరికీ చెప్పక, ఎలాగయినా థర్డ్‌ఫారమన్నా పాసవుతాను. సవ్యంగా అంతా జరిగితే నీకు వ్రాస్తాను” అన్నాడు. నేను, అతను తన విషయం చెప్పేవరకు రహస్యం దాచుతానని మాట ఇచ్చాను.

అతను వెళ్ళిపోయాడు. నేను ఇంటిల్లిపాదికీ సన్నిహితుడిని. అతని అక్కగారు నర్సమ్మక్క భర్తకు జాబులు వ్రాయడానికి మంచి భాషకు నేనుండాలి. “రాముడూ బావగారిని రమ్మని రాయరా. చాల బాధపడుతున్నానని వ్రాయరా” అనేది. నేను వ్రాసేవాడిని. భర్త తాసీల్దారు. ఎక్కడ వస్తాడు త్వరగా? వాళ్ళంతా అడిగారు. తమ కుమారుని ఆచూకీ తెలుపమని. నాకేం తెలుసు?

మా పెద్దమ్మాయి 1954లో పుట్టింది. బారసాలకు అత్తవారి ఊరు వెళ్ళాను. మద్రాసు బొంబాయి రైలు మార్గంలో రాయచూరు తర్వాత యాద్‌గిరి స్టేషనులో దిగి బస్సులో ముప్పైమైళ్ళు పయనిస్తే సురపురం – అత్తవారి ఊరు. యాద్‌గిరి స్టేషనులో దిగాను. తెల్లవారుజాము. టికెట్ టికెట్ అంటూ స్టేషను మాస్టర్ దగ్గరికి వచ్చాడు. గొంతు ఎక్కడో విన్నట్టుందే అనుకొని “తమ గొంతు ఎక్కడో విన్నాను” అన్నాను. “మొదట టిక్కెట్ ఇవ్వండి. బండి వెళ్ళిన తర్వాత మాట్లాడుకుందాం” అన్నాడు అతను. నేను అక్కడే నిలబడి ఆలోచిస్తున్నాను, టికెట్ అందజేసి.

## II

గొంతు పోల్చుకున్నాను. ఒరె ఒరె ఒరె! రాతి బసవన్న కదూ! అనుకున్నాను. "ఇప్పుడు చెప్పండి" అంటూ వచ్చాడు. ఇరవై ఏడేళ్ళకాలం... దాదాపు ఒక తరం గడిచింది. ఆజానుబాహువుగా పెరిగాడు. మీరు నా సహాధ్యాయుడు రామాచార్ల... గొంతు... అంటూ నీళ్ళు నమిలాను. చేతిలో ఉన్న లైటు కిందపడేసి




"ఒరే ఒరె! రాముడు కదూ! నిన్ను తలచుకోని గడియలేదనుకో" అంటూ నన్ను పైకెత్తి కావలించుకున్నాడు. "ఇక్కడ నేను స్టేషను మాస్టరును. అసిస్టెంట్ సెలవుమీద ఉన్నాడు. డ్యూటీకి రావలసివచ్చింది. క్వార్టర్సుకు వెళదాం. నీవు దారి చూపిన కథ చాల ఉంది. సురపురానికి బస్సా? గంటకు ఒకటి. బారసాల ముహూర్తం దాటకుండా పంపే ఏర్పాటు చేస్తా" అంటూ పోర్టర్‌ను పిలిచి నా చేతి సంచీ అతని చేతికిచ్చి, "అమ్మగారికి చెప్పు, తెల్లవారుతోంది. అయ్యగారి ఫ్రెండ్ వచ్చారట. కాఫీ, టిఫిన్ రెడీగా ఉండాలట–" అని హుకుములపై హుకుములు ఇస్తూ పోయాడు. అతని ఆనందం, సంరంభం చూడముచ్చటగా ఉన్నాయి.

క్వార్టర్స్ చేరి ఏకంగా స్నానాదులు ముగించుకొని ఫలహారం ముందు పెట్టుకొని కూచున్నాము. కథ చెప్పాడు.

టికెట్ లేకుండా బండి ఎక్కాడు కట్టుగుడ్డలతో, ధర్మవరం జంక్షన్‌లో దింపేశారు. ఊళ్ళోకి వెళ్ళాడు. ఒక ఉపాధ్యాయుని ఇంటికి వెళ్ళాడు. తన సంగతి చెప్పాడు. ధర్మవరంలో నీటికి కటకట ఆ కాలంలో చెరువుకు మైలు దూరం. "అబ్బాయ్! నేను నీకు ఒక వారం ఇస్తాను. తక్కిన ఆరువారాల భోజనం ఏర్పాటుకు ప్రయత్నిద్దాం. నాకు చెరువునుంచి పూటకొక బిందె మంచినీళ్ళు తెచ్చిపెట్టాలి. అరుగుమీద గదిలో పడుకోవచ్చు" అన్నాడు ఆ ఉపాధ్యాయుడు. ఒప్పుకున్నాడు ఇతడు.

వారాలు దొరికాయి. బుద్ధి వికసించింది. సంస్కృతం పాఠాలు వల్లెవేసిన పద్ధతి అంతా కంఠపాఠం. ఆరు నెలల శిక్షణతో థర్డ్‌ఫారంలో చేర్పించాడు ఆయన. బుద్ధి చురుకుదేరింది. శంకరనారాయణ డిక్షనరీ, నెస్‌ఫీల్డ్ గ్రామర్ కంఠపాఠం, స్కూల్లో అతనికి శంకరనారాయణ ముద్దుపేరు. ఆరోఫారానికి వచ్చాడు. అంతవరకు అజ్ఞాతవాసమే.

అప్పుడు దిగాడు ఒక ఎం.ఎస్.ఎమ్.రైల్వే అధికారి. శ్రీవైష్ణవుడు, అల్లుళ్ల వేట కోసం, ఉపాధ్యాయులందరూ ఇతనిని సిఫార్సు చేశారు. అయితే ఒక షరతు. రైల్వేలో ఉద్యోగం ఇప్పించిన తర్వాతే వివాహం. ఇది హెడ్‌మాస్టారు విధించిన షరతు. ఆరవ ఫారం ప్యాసయ్యాడు. రైల్వే గుమాస్తా ఉద్యోగం దొరికింది. ఎంత అదృష్టం అన్నారు. స్కూలు సిబ్బంది తల్లిదండ్రులను పిలిపించి నిశ్చితార్థం, వివాహం జరిపించారు. అతడు రైల్వే అత్యవసర పరీక్షలు ప్యాసయి స్టేషన్ మాస్టరయ్యాడు.

ప్రస్తుతం షోలాపూర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పదవికి సెలెక్టయ్యాడు. ఇంకా పదహైదు సంవత్సరాల సర్వీసులో రెండు మూడు పై పదవులు లభించవచ్చు.

"ఒరేయ్! నీవు సకాలంలో మంచి సలహా ఇచ్చావురా, సంస్కృతం వల్లింపు ఇంగ్లీషుకు తగిలించాను. సంస్కృతం రానందిగాని, ఇంగ్లీషు రాక ఛస్తుందా?" అని నవ్వాడు. "మీ గొప్పతనం కాదండీ, మంచినీళ్లబిందెలు మోసిన మహాత్యం! మెడ, మెదడులోని కండరాలు, కణాలు కదిలి తెలివి బయటపడింది" అన్నది భార్య. ఆమె మెట్రిక్ ప్యాసయింది. అందరం విరగబడి నవ్వాము.

"అంతా నీ అదృష్టం, స్వయంకృషి, నా సలహా లేకపోయినా నీవు పాఠశాల వదిలేవాడివే. కాలం, తోసుకుపోతుంది" అన్నాను. "అది కాదు అన్నగారూ, మీ మంచి మాట అమృత గుళికలాగ పనిచేసింది కదా!" అన్నది అతని భార్య.

## III

మరొక తుమ్మమొద్దు. ఏ.వి.సుబ్రహ్మణ్యం. రాయవెల్లూరువాడు. తెలుగు కూడ వచ్చు. ఆజానుబాహుడు. నాకన్నా రెండు మూడేళ్ళు పెద్దవాడు. రాతిబసవన్నకన్నా నల్లరాయి. 'ధూమశకట ముద్దిశ్య లేఖో లిఖ్యతామ్' – రైలును గురించి వ్యాసం వ్రాయండి – అని ప్రశ్న ఇచ్చారు. నేను సంస్కృత వ్యాసరచనలో కాలేజీకే మొనగాడినని పేరు, అప్పటికే సాక్షి, వదరు బోతు, ఇతర వ్యాసాలు చదివి విషయం సేకరించి దాదాపు వంద వ్యాసాలు మంచి శైలిలో వ్రాశాను. మూడు పుటలు వ్రాయడమంటేనే తలప్రాణం తోకకు వచ్చేది. సుబ్రహ్మణ్యం పత్తు పక్కం – పదిపుటలు వ్రాశానన్నాడు. నాకు ఆశ్చర్యమయింది. "ధూమశకటం గిడ్ గిడ్ ఇతి గచ్ఛతి" అని వ్రాశాడు. గిడ్ గిడ్ పది పుటలు. మొదటిది, చివరిది మాత్రం పదాలు. ఉపాధ్యాయులు క్లాసులో నిలబెట్టి తిట్టారు. సిగ్గులేదా? గాడిదలాగా పెరిగావు. రాకపోతే ఊరికే ఉండు. అంతేకాని గిడ్‌గిడ్ అని పది పుటలు పాడుచేస్తావా? ఇలా అరగంట వషట్కారాలు.

సాయంత్రం ఏకాంతంగా నా సలహా అడిగాడు "నీకు కాశీ విశ్వవిద్యాలయంలో మహామహోపాధ్యాయ చిన్నస్వామి శాస్త్రిగారు బంధువన్నావు గదా! పోయి ఆయన కాళ్ళమీద పడు, గంగాజలాలు నీ అవివేకాన్ని పోగొడుతాయి. విశ్వేశ్వరుడు కరుణిస్తాడు" అన్నాను. స్వయంగా కొని తెచ్చుకున్న అవమానం మరి. ఉండలేకపోయాడు. మరుసటిదినం నుంచి కనిపించలేదు.

రెండు దశాబ్దాల పైచిలుకే గడిచింది. నేను నా మిత్రులు వడ్లమూడి సత్యనారాయణగారు, ఆయన కుమార్తె సంబంధంకోసం గుంతకల్లు దగ్గరి ఉరవకొండకు బయలుదేరాము. మద్రాసు – బొంబాయి మెయిలు ఎక్కాము. అంతకుముందే బండి ఎక్కి సామాను సర్దుకుంటున్న ఒక వ్యక్తి మాటలు వినిపిస్తున్నాయి. వేషం పండిత వేషం. "మాకీ కాశీకి పోవాలని ఉంది. బొంబాయినుండి వేరే గాడీ పట్టుకుంటాం. మాదీ ఇక్కడే వేలూరు. మగర్ (కాని) చాలాకాలం కాశీలో ఉన్నాం. తెలుగులో గల్తీలు ఉంటయ్..." అని మాట్లాడేస్తున్నాడు. బండి కదిలింది. అతడు సామాను సర్ది ఇటు తిరిగాడు.

"మీరు సుబ్రహ్మణ్యం కదూ?" అన్నాను మనిషిని చూడగానే. "అడడా! రామచెంద్రా ఎంగె వందే. ఎంగె పోరే?" (ఎక్కడికి వచ్చావ్? ఎక్కడికి వెళ్తున్నావ్?) అన్నాడు. నాకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుండా కలగాపులగపు తెలుగులో "నేనిప్పుడు పాత గిడ్‌గిడ్ ఇతి గచ్ఛతి సుబ్రహ్మణ్యం కాదు, బెనారెస్ విశ్వవిద్యాలయంలో సంస్కృత రీడర్‌ను తెలుసా? మీమాంసా, వ్యాకరణ, తర్క, వేదాంత శాస్త్రాల్లో ఆచార్య పరీక్షలలో ప్రథముణ్ణి సుమా! నాలుగైదు శాస్త్రవ్యాఖ్యాన గ్రంథాలు వ్రాశాను. అదృష్టముంటే ప్రొఫెసర్ అవుతాను" అంటున్నాడు.



నేను మధ్యన అడ్డుకొని "సుబ్రహ్మణ్యం! అంతా గంగాజల ప్రభావం" అన్నాను.

"నిజమే సుమా" – అంటూ తన కథ చెప్పాడు. ఊరికే పోతే తిడతారని బండెక్కాడట. పది రూపాయలకన్న ఎక్కువ డబ్బు లేదు. జాలార్‌పేటలో దిగాడు. అక్కడి నుంచి కాశీకి పోయే ఒక వృద్ధదంపతుల పరిచయమయింది. సుబ్రహ్మణ్యం బ్రాహ్మణవటువు కదా! స్వచ్ఛంగా ఉన్నాడు. వృద్ధురాలు అడిగింది. "నాయనా ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని. "కాశీకి వెళ్ళుదామనుకుంటున్నాను" అన్నాడు ఇతడు. "అయితే మాకు సహాయకుడుగా ఉండు, రైలు ఛార్జీలు మేము పెడతాము. యాత్ర పుణ్యం దక్కుతుంది" అంటూ, "కాశీలో ఏం పని?" అని అడిగింది ముసలమ్మ. "సంస్కృతం చదవడానికి, చిన్నస్వామి శాస్త్రిగారి సన్నిధికి" అన్నాడు ఇతడు. వృద్ధుడు శాస్త్రిగారి పేరు విన్నాడు గనుక సుబ్రహ్మణ్యాన్ని విశ్వసించాడు. అదృష్టం తోసుకొని వచ్చింది. కాశీ చేరిన పిదప వాళ్ళ అవసరం తీరే వరకు వెంట ఉండి, చిన్నస్వామి శాస్త్రిగారి ఇంటికి వెళ్ళి ఆయనకు సాగిలపడి ప్రవర చెప్పుకున్నాడు సంప్రదాయానుసారం. అప్పుడు చలికాలం ప్రారంభం. "దినమూ తెల్లవారుజామున గంగాస్నానం చేసిరా. మా ఇంట్లో మా పిల్లలతోపాటు ఉండు. ఇది నీకు నెల రోజుల పరీక్ష. నీవు నెగ్గినట్టు నాకు విశ్వాసం కలిగితే చదువు చెప్పడం తర్వాత" అన్నారు శాస్త్రిగారు. సుబ్రహ్మణ్యం ఆ పరీక్షలో నెగ్గాడనీ, విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే సంస్కృత కళాశాలలో చేరి మహావిద్వాంసుడయ్యాడని చెప్పనక్కరలేదు. అక్కడే అధ్యాపకోద్యోగమూ ఇప్పించారు గురువుగారు.

అంతటి చింతమొద్దులూ, తుమ్మమొద్దులూ మంచి దారుశిల్పి చేతిలో పడి దేవతా మూర్తులయిన కథ ఇది.

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది ప్రశ్నలకు ఆలోచించి సొంతమాటల్లో సమాధానాలు చెప్పండి.**

అ) "మొద్దబ్బాయిలూ మహామేధావులే" అని పాఠం పేరు విన్నప్పుడు మీలో కల్గిన అనుభూతులను తెలపండి.

వ) "మొద్దబ్బాయిలు" అనేవారు ఎవరూ ఉండరు. ఎవరికైనా తగిన అవకాశాలు కల్పిస్తే, ప్రోత్సహిస్తే, సాధనద్వారా గొప్పవాళ్ళుగా మారుతారు" ఈ విషయం గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.

**2. పాఠం చదవండి. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| క్ర.సం. | విషయం | ఆ విషయం ఉన్న పేరా సంఖ్య / పంక్తి సంఖ్య |
|---|---|---|
| 1. | రాతిబసవని వివరాలు | |
| 2. | రాతిబసవడు కలిసినవారి వివరాలు తెలిపే పేరా | |
| 3. | పాఠంలో హాస్యసంఘటన వివరించే పేరా | |

**3. కింది వాక్యాలను ఎవరు ఎవరితో అన్నారో పాఠం ఆధారంగా రాయండి.**

అ) "బతుకు ముఖ్యం. సంస్కృతం కాదు, తర్వాత ఇష్టం ఉంటే చదువుకో."

ఆ) "రాముడూ బావగారిని రమ్మని రాయరా."

ఇ) "మొదట టిక్కెట్ ఇవ్వండి. బండి వెళ్ళిన తర్వాత మాట్లాడుకుందాం."

ఈ) "రాకపోతే ఊరికే ఉండు. అంతేకాని గిడ్‌గిడ్ అని పదిపుటలు పాడుచేస్తావా?"

**4. గాంధీ బోధనల్లోని కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

నేను నాలో ఉన్నట్లు చెప్పుకునే సుగుణాలు సత్యం, అహింస. మానవాతీత శక్తులున్నట్లు నేను చెప్పుకోజాలను. అటువంటివాటిని నేను కోరుకోను. సిసలైన మతం సంకుచితమైన పిడివాదం కాదు. అది భగవంతునిలో విశ్వాసముంచటం. భగవంతుని సన్నిధిలో జీవించటం. అంటే భావిజీవితంలో, సత్యంలో, అహింసలో విశ్వాసం ఉండడం అని అర్థం. ఆత్మగతమైన ఈ విషయాలపట్ల నేడు ఒకరకమైన నిర్లక్ష్య భావన నెలకొని ఉంది. ఆలోచనలో సత్యం, వాక్కులో సత్యం, కార్యాచరణలో సత్యం ఉండాలి. సత్యం లేనిచోట సిసలైన జ్ఞానం ఉండదు.

అ) గాంధీగారు తనలో ఏయే సుగుణాలు ఉన్నాయని చెప్పారు?

ఆ) గాంధీజీ సత్యం గురించి ఏమన్నారు?

ఇ) సిసలైన మతం ఎలా ఉంటుంది?

ఈ) పై పేరాలో గాంధీ చెప్పిన మూడు ముఖ్య విషయాలేవి?

**5. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రామచంద్ర తన మిత్రుడు రామాచార్లకు ఏమని సలహాఇచ్చాడు?

ఆ) రాతిబసవడు అసలు పేరేమిటి? ఆయన విద్యాభ్యాసం ఎలా జరిగింది?

ఇ) సుబ్రహ్మణ్యం మహావిద్వాంసుడు ఎలా అయ్యాడు?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) సంస్కృతంలో వ్యాసం రాయమంటే 'గిడ్‌గిడ్' అని పది పుటలు రాసిన సుబ్రమణ్యం మహావిద్వాంసుడు ఎలా అయాడు?

ఆ) "అవసరమైనప్పుడు చెప్పే మంచిమాట ఎంతో మంచి చేస్తుంది" పాఠం ఆధారంగా దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

ఇ) "నా స్వభావంలో మంచి ఉంది. ఎవరేమి చెప్పినా శ్రద్ధగా వింటాను" అని తిరుమల రామచంద్ర చెప్పాడుకదా! దీనివల్ల కలిగే మేలు ఏమిటి?

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

అ) ఈ పాఠం ఆధారంగా తిరుమల రామచంద్ర గురించి మీరేమి తెలుసుకున్నారు?

ఆ) రాతిబసవడు రామాచార్లు, చెక్కబసవడు సుబ్రమణ్యం జీవితాలు మారిపోవడానికి కారణాలు ఏమిటి? వారి నుండి విద్యార్థులు గ్రహించాల్సిన విషయాలు ఏవి?

**3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ జవాబులు రాయండి.**

అ) చదువులో వెనకబడిన మిత్రుణ్ణి నిరుత్సాహపడగూడదని ప్రోత్సహిస్తూ ఒక లేఖ రాయండి.

ఆ) "ఒక రంగంలో రాణించలేని వాళ్ళు వేరే రంగంలో రాణించవచ్చు" - దీనిపై మీ అభిప్రాయాలతో ఒక వ్యాసం రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలు చదవండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

చింతాక్రాంతుడు ఇంటిల్లిపాదీ ఆచూకీ అజ్ఞాతవాసం

**2. కింది ఖాళీలలో సరైన పదాలు రాయండి.**

అ) కళాశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు ________ పుచ్చుకొని ఉద్యోగాన్వేషణకు వెళ్ళారు.

ఆ) అతివృష్టితో ఆస్తిపాస్తులు కోల్పోయినవారిపట్ల ________ చూపి సహాయంచేయాలి.

ఇ) క్రమశిక్షణరాహిత్యంతో ప్రవర్తించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుని మాటలు ________.

ఈ) దొంగల ________ కోసం పోలీసులు కుక్కల సహాయంతో గాలించారు.

ఉ) విద్యావంతులు ఇతరులపై ఆధారపడకుండా ________ తో ఎదిగే ప్రయత్నం చేయాలి.

### వ్యాకరణాంశాలు

**1. కింది ఖాళీలను పూరించండి.**

| | సంధిపదం | విసంధి | సంధిపేరు |
|---|---|---|---|
| అ) | చేరినట్లు | ________ + ________ | ________ |
| ఆ) | ________ | క్లేశాలు + అన్నీ | ________ |
| ఇ) | ________ | సుయోధన + ఆది | ________ |
| ఈ) | వారెవరు | ________ + ________ | ________ |
| ఉ) | చెప్పవలసినదేమి | ________ + ________ | ________ |
| ఊ) | కలిగినప్పుడు | ________ + ________ | ________ |
| ఋ) | కృష్ణార్జునులు | ________ + ________ | ________ |
| ౠ) | ________ | తిడతారు + అని | ________ |

**2. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేర్లు తెలపండి.**

| | సమాసపదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| అ) | యోగక్షేమాలు | i) | క) |
| ఆ) | పంచపాండవులు | ii) | ఖ) |
| ఇ) | ఆకలిదప్పులు | iii) | గ) |
| ఈ) | నూరుగురు కుమారులు | iv) | ఘ) |
| ఉ) | రాగద్వేషాలు | v) | ఙ) |

**3. కింది పదాలను పరిశీలించండి.**

ఆ + చోట → ఆ + చ్చోట → అచ్చోట

ఈ + కడ → ఈ + క్కడ → ఇక్కడ

ఏ + విధం → ఏ + వ్విధం → ఎవ్విధం

సంధి ఏర్పడిన విధానాన్ని పరిశీలించండి. పై ఉదాహరణల్లో సంధి మూడు విధాలుగా జరిగింది.

i) ఆ, ఈ, ఏ లు అనే దీర్ఘాచ్చులున్నాయి. ఆ, ఈ, ఏ లను 'త్రికము' అని అంటారు.

ii) ఈ త్రికంతో సంధి జరిగినప్పుడు పరపదంలోని తొలి హల్లులు ద్విత్వాక్షరాలుగా మారతాయి.

ఏ + విధం → ఏ + వ్విధం

iii) ఈ క్రమంలో ద్విత్వాక్షరంపైన ఉన్న, అంటే పూర్వపదంలోని దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులుగా మారుతాయి.

ఏ + వ్విధం → ఎవ్విధం

పై మూడు వివరణలను సూత్రరూపంలో కింది విధంగా చెప్పవచ్చు

i) ఆ, ఈ, ఏ లు త్రికం.

ii) త్రికం మీది అసంయుక్తాక్షర హల్లు ద్విత్వమవుతుంది.

iii) ద్విత్వానికి ముందున్న త్రికం హ్రస్వమౌతుంది.

ఇలా త్రికం (ఆ, ఈ, ఏ)తో సంధికార్యం జరుగుతుంది కాబట్టి అచ్చోట, ఇక్కడ, ఎవ్విధం లాంటి పదాలలో 'త్రికసంధి' జరిగిందని గుర్తించాలి.

♦ **కింది పదాలలో త్రికసంధికి చెందిన పదాలను గుర్తించండి. వాటిని విడదీయండి.**

రామాజ్ఞ, అత్తఱి, మీరేమి, ఎవ్వారు, మేమంతా, ఇత్తరి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ చిన్నప్పుడు సరిగా చదవకపోయినా, తరవాత కష్టపడి పైకివచ్చిన ప్రముఖుల వివరాలు సేకరించండి. వారి జీవితాలనుండి గ్రహించాల్సిన విషయాల గురించి నివేదిక రాసి ప్రదర్శించండి.




**పరిశ్రమ, తెగువ, ధైర్యం, బుద్ధి, బలం,**
**పరాక్రమం - ఈ ఆరూ ఉన్నచోట**
**దైవం తోడ్పడుతుంది.**